## వైద్యుడిపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ములుగురూరల్, మే12 : వైద్య చికిత్సలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వెంకటాపూర్ మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన గుర్రం శ్రీహరి సోమవారం గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆయన కథనం ప్రకారం.. నాలుగేండ్ల క్రితం కాలుకు చిన్న కురుపు కాగా జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ రవీందర్ వద్దకు వెళ్లగా చికిత్స చేశాడని అన్నారు. కొంత కాలానికి కాలు మొత్తం విషపూరితమైందని, ఎంజీఎంకు వెళ్లమని చెప్పగా అక్కడ కాలు తొలగించారని తెలిపాడు. తిరిగి ఇటీవల రెండో కాలికి కూడా వాపు రాగా అదే డాక్టర్ వద్దకు వెళ్లగా 15 రోజులకు ఒక సారి రావాలని మందులను రాశాడని అన్నారు. వెళ్లిన క్రమంలో రూ.2వేలతో మందులను కొనుగోలు చేసి వాడినా వాపు తగ్గకపోవడంతో సదరు వైద్యుడు హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు పంపించాడన్నారు. కాలు మొత్తం ఇన్ఫెక్షన్ అయిందని చెప్పి ఆపరేషన్ చేశారని, ప్రస్తుతం రెండో కాలు కూడా తీసివేయాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. వైద్యుడిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరినట్లు శ్రీహరి వివరించాడు.

## సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి

కాటారం, మే 12 : కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు రాజీవ్ యువ వికాసం ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చే ఉద్దేశం ఉందా ? ఉంటే సబిల్ స్కోర్ నిబంధన ఎందుకు పెట్టారని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ ప్రశ్నించారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండానే సబ్సిడీ రుణాలు ఇస్తామని చెప్పి తీరా ఔత్సాహికులు దరఖాస్తు చేసుకున్నాక ఇప్పుడు సిబిల్ స్కోర్ నిబంధన పెట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 16లక్షల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేసరికి తప్పించుకునే ప్రయత్నంలో సబిల్ స్కోర్ నిబంధన తిరకాసు పెట్టారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన అంబేద్కర్ అభయ హస్తం అమలు చేసి అర్హులైన దళితులకు రూ.12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రాజీవ్ యువ వికాసం రుణాలు వర్తింపచేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాసి పార్వతి, మినుగు నగేశ్, దారకొండ సూర్యశంకర్ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

కాటారం, మే 12 : మండలంలోని కాటారం గ్రామానికి చెందిన దాడిచెర్ల అశోక్‌కు చెందిన ఎద్దు విద్యుత్ షాక్‌తో సోమవారం మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం.. మేత కోసం వెళ్లిన ఎద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగకు తాకి షాక్‌కు గురై చనిపోయిందన్నారు. సుమారు రూ.45 వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

## క్షేత్రస్థాయి విధుల పరిశీలన

మొగుళ్లపల్లి, మే 12 : నలుగురు ట్రైనీ ఐపీఎస్ సభ్యుల బృందం శిక్షణలో భాగంగా సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిధిలో రోజూ చేపడుతున్న కార్యక్రమాలను ఎస్‌హెచ్‌వో స్థాయిలో విధులు, బాధ్యతలు తదితర అంశాలను పరిశీలించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

## పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వినతి

ములుగురూరల్, మే 12 : జిల్లా కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్ఎస్, భారత జాగృతి, బీసీ కుల సంఘాలు, మెపాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ టీఎస్ దివాకరకు వినతపత్రం అందజేశారు. ములుగులోని ఏదైనా ఒక కూడలిలో స్థలం కేటాయించి విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు కొగిల మహేశ్, లక్ష్మీదేవిపేట బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గట్టు శ్రీనివాస్, మెపా జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్, భారత జాగృతి జిల్లా అధికార ప్రతినిధి అంతటి రాము, వెంకటాపూర్ మండల అధికార ప్రతినిధి ముడిగె రాజ్‌కుమార్, బీసీ, మున్నూరు కాపు, వడ్రంగి, యాదవ, నాయీ బ్రహ్మణ సంఘాల నాయకులు శ్రీకాంత్, ఆకుతోట చంద్రమౌళి, నవీన్, చంద్రమౌళి, గొర్రె సమ్మయ్య, అన్నం మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కన్వీనర్‌గా రఘు

ములుగురూరల్, మే 12 : రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ములుగు జిల్లా కన్వీనర్‌గా ములుగు మండలం కాసిందేవిపేట గ్రామానికి చెందిన గుండాల రఘు నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఐలయ్య ఆయనకు నియామక పత్రాన్ని అందించారు.

## గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ

ఏటూరునాగారం, మే 12 : ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పీవో చిత్రామిశ్రా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సాగులో ఉన్న పోడు భూములకు బోర్లు వేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు చిరంజీవి, దామోదర్ వినతిపత్రం అందజేశారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఏటూరునాగారం, మే12 : మండలానికి చెందిన కప్ప వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా తోటి మిత్రులు సోమవారం రూ.10,700 అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకన్న కుటుంబ పరిస్థితిని వాట్సప్ ద్వారా తెలియజేయగా వరంగల్‌కు చెందిన యువ నేతాజీ ఫౌండేషన్ సభ్యుడు గజ్జల సుమన్, దాతలు సహకారం అందించారన్నారు. సేకరించిన నగదును కుటుంబానికి అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో గాడిచర్ల రాజశేఖర్, రాకుమార్, నరేశ్, బ్రహ్మం, సునీల్, సునీల్ కుమార్, అరుణ్‌కుమార్, రవికుమార్, రమేశ్, సతీశ్‌కుమార్, లవన్‌కుమార్, శేఖర్, సర్వేష్, రాజేంద్రప్రసాద్, సురేశ్, కానిస్టేబుల్స్ కన్నె రాజు, బొట్టు కమలాకర్, కోట రాజేశ్ పాల్గొన్నారు.

## వైద్య సిబ్బందికి శిక్షణ

ములుగు రూరల్, మే12 : డీఎంహెచ్‌వో కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బందికి సోమవారం కుటుంబ నియంత్రణ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కుటుంబ నియంత్రణ పద్ధతులపై సిబ్బంది గ్రామాల్లో పర్యటించి అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. వైద్యాధికారి రణధీర్, డెమో సంపత్, సిబ్బంది పూర్ణ, సంపత్‌రావు, దుర్గారావు, సాంబయ్య, శకుంతల ఉన్నారు.

## లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

వాజేడు/ వెంకటాపురం (నూగూరు) మే 12 : బొగత జలపాతం వద్ద రాతి గుహలో వెలసిన స్వయంబు శ్రీ భోగాద్రి లక్ష్మీనర్సింహస్వామి, వెంకటాపురం (నూగూరు) సడిబాక గుడి గుట్టల్లోని లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి, అమ్మవార్ల కల్యాణ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు శ్రీనివాసశర్మ, కనుకుంట్ల హరిప్రసాద్ స్వామి, ఉయిక రాంబాయి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సీఎస్ఆర్ నిధుల నుంచి వైద్య పరికరాలు

మల్హర్, మే 12 : తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి జెన్కో ఆధ్వర్యంలో ఏఎమ్మార్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ.2 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను సోమవారం అందించారు. కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు కంపెనీలో పని చేస్తున్న జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శ్రీకాంత్ పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్‌భాస్కర్‌కు ఈ పరికరాలను అందించారు. దీనిలో ఈసీజీ మిషన్, ఫ్రిడ్జ్, నెబలైజర్, కంప్యూటర్, ప్రింటర్, వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సీబీపీ కెమికల్స్, ఎక్స్‌రే ఫిలిమ్స్, ఎక్స్‌రే కెమికల్స్ అందించారు. కార్యక్రమంలో హెచ్ఆర్ డీజీఎం రమేశ్‌బాబు, హెచ్ఆర్ అడ్మిన్ ప్రశాంత్, సీఎస్ఆర్ సూపర్‌వైజర్ బొబ్బిలి నరేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక లారీలతో ఇంకెన్ని ప్రాణాలు పోవాలె ?

### మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



ధన్వాడలో లారీ ప్రమాదంలో మృతి చెందిన రాజలింగు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

కాటారం, మే 12 : 'ఇసుక లారీలతో ఇంకెంత మంది ప్రాణాలు బలి పెట్టాలె.. రెండు రోజుల్లో ఇసుక బంద్ చేయిస్తా అని చెప్పి 17 నెలలు కావస్తున్నా ఎందుకు బంద్ పెడుతలేరు.. మీ నిర్లక్ష్యం వల్లే అనేక మంది బలవుతున్నారు.' అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ధ్వజమెత్తారు. కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన తులిసెగారి రాజలింగు ఇటీవల ఇసుక లారీ ఢీకొని మృతి చెందగా, సోమవారం ఆయన కుటుంబ సభ్యులను మధు పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాను గెలిచిన తర్వాత రెండు రోజుల్లోనే ఇసుక రవాణా బంద్ చేయిస్తానని చెప్పిన మంత్రి శ్రీధర్ బాబు గెలిచి మంత్రి పదవి తీసుకుని 17 నెలలైనా ఎందుకు పట్టించుకోవడం లేదో నియోజక వర్గ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పైగా 24 గంటలు రవాణాకు అనుమతి ఇచ్చి ఎంతోమంది ప్రాణాలు పోవడానికి కారణం అవుతున్నారని ఆరోపించారు. నియోజక వర్గంలో జరుగుతున్న ఇసుక లారీ ప్రమాదాలకు మంత్రి బాధ్యత వహించి బాధితులకు నష్ట పరిహారం ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

కాటారం/ మహదేవపూర్ / పలిమెల : కాటారం మండలంలోని పలువురు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. మండల కేంద్రం గారెపల్లిలో చీమల రమేశ్ మృతి చెందగా సోమవారం ఆయన మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కొత్తపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న పెద్ద లక్ష్మయ్య కూతురు మౌనికను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆదివారంపేట గ్రామంలో చీర్ల రాజిరెడ్డి ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే కాళేశ్వరంలో మాజీ సర్పంచ్ వెన్నపురెడ్డి వసంత తండ్రి ఇటీవల మృతి చెందాగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కాళేశ్వరం దేవస్థానం మాజీ డైరెక్టర్ కామెడి రామ్ రెడ్డికి ఇటీవల గుండె శస్త్ర చికిత్స జరుగగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు జక్కు రాకేశ్, జోడు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, గాలి సడవలి, పంతకాని సడవలి, ఉప్పు సంతోష్, శ్రీలక్ష్మి, తైనేని సతీశ్, మానెం రాజబాపు, హనుమల్ల రమేశ్, మేడిగడ్డ దుర్గారావు, పెద్ది లక్ష్మయ్య, సమ్మయ్య, దేవానాయక్, రాజ్‌కుమార్, మహేశ్, కోట రమేశ్, రత్న రమేశ్‌రెడ్డి, దుర్గం రాజేశ్, బాపు, రాకేశ్, తుంబర్ల రమణ, బోడ తిరుపతి, తులిసెగారి శ్రీనివాస్ ఉన్నారు. పలిమెల మండలంలోని పంకెన గ్రామానికి చెందిన పాగే మధుకర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అలాగే పంకెన గ్రామంలో టేకుల నాగమ్మ కుటుంబాన్ని పుట్ట మధు పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అద్భుత ఘట్టానికి వేదిక కానున్న కాళేశ్వరం

### భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ


మహదేవపూర్ (కాళేశ్వరం) మే 12 : దక్షిణాది రాష్ట్రాల్లో ఏకైక త్రివేణి సంగమం, దేశంలో రెండో ప్రాంతమైన కాళేశ్వర క్షేత్రం అద్భుత ఘట్టానికి వేదిక కాబోతున్నదని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. సరస్వతీ (అంతర్వాహిని ) పుష్కరాలకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్న సందర్భంగా సోమవారం ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ కాశీ పీఠాధిపతులతో నదీ హారతి కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ నెల 15న రాష్ట్ర ముఖ్యమంత్రి సరస్వతీ మాత విగ్రహం ఆవిష్కరించడంతో పాటు గోదావరి హారతి, త్రిలింగ క్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రపంచంలో యముడు, శివుడు లింగాకారంలో వెలసిన ఏకైక క్షేత్రం త్రివేణి సంగమమైన కాళేశ్వరంలో సాక్షాత్కరిస్తుండడం ఈ ఆలయానికి ఉన్న మరో ప్రత్యేకతని అన్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పుష్కరాలు నిర్వహించనున్న 12 రోజుల పాటు భక్తులకు సేవలందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులో ఉండేలా ప్రణాళికలు చేశామన్నారు. అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

**గోదావరికి హారతి**

కాళేశ్వరం ఆలయ ఉప ప్రధాన అర్చకులు ఫణీంద్రశర్మ ఆలయం నుంచి మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రాలతో గోదావరి నది వద్దకు వెళ్లి నదీ హారతి కార్యక్రమం చేపట్టారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే



ఎమ్మెల్సీ కవితకు శాలువా ఇచ్చి స్వాగతం పలుకుతున్న నేతలు

## ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ నేతల స్వాగతం

ములుగురూరల్, మే 12 : గట్టమ్మ దేవాలయం వద్ద సోమవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బీఆర్ఎస్ నాయకులు పుష్పగుచ్ఛం, శాలువా అందించి స్వాగతం పలికారు. ఈ మేరకు కవిత గట్టమ్మ తల్లికి పూజలు చేశారు. స్వాగతం పలికిన వారిలో మాజీ జడ్పీటీసీ సకినాల భవాని, మాజీ ఎంపీపీ మస్రగాని వినయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, దళిత బంధు సాధన రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేశ్, మాజీ ఎంపీటీసీలు పోరిక విజయ్‌రామ్‌నాయక్, గొర్రె సమ్మయ్య ఉన్నారు.



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

# కనుల పండువగా హేమాచలుడి కల్యాణం

మంగపేట, మే 12 : హేమాచల లక్ష్మీనర్సింహస్వామి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామి వారి కల్యాణాన్ని సోమవారం మధ్యాహ్నం 12:35 గంటలకు వేద బ్రాహ్మణుల బృందం అభిజిత్ లగ్న సుముహూర్తాన కన్నులపండువగా నిర్వహించారు. కలెక్టర్ టీఎస్ దివాకరతో కలిసి మంత్రి సీతక్క స్వామి వారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాగ శాలలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేతంగా లక్ష్మీనర్సింహస్వామి వారిని ప్రత్యేక పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణ మండపంలో ఆసీనులను చేశారు. భద్రాచలం అర్చకులు అమరవాది మురళీ క్రిష్ణమాచార్యుల బృందం, మల్లూరు ఆలయ అర్చకులు రాఘవాచార్యులు, రాజశేఖర శర్మ బృందం ఆధ్వర్యంలో కల్యాణ తంతు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచే గాక ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన కంచెర్ల గోపన్న వారసుడు శ్రీనివాస్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై సూరి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

అనంతరం మంత్రి సీతక్క పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ నిత్యం భక్తులు స్వామివారి దర్శనం కోసం వస్తున్న నేపథ్యంలో భక్తులకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, తహసీల్దార్ తోట రవీందర్, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎర్రంగారి సురేశ్, ఈవో సత్యనారాయణ, భద్రాచలం అర్చక బృందం, స్థానిక అర్చకులు కారంపూడి పవన్ కుమార్ ఆచార్యులు, ఈశ్వర్‌చందుశర్మ, మురళీశర్మ, సీతారాములు, వెంకటనారాయణశర్మ, సుధీర్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలి



గేటు మీటింగ్‌లో మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

కృష్ణకాలనీ, మే 12: ఈనెల 20న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కేటీకే- 5 ఇంక్లైన్ గని ఆవరణలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యూఎస్ సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్ఎంఎస్, ఐఎఫ్టీయూ, సింగరేణి ఉద్యోగుల సంఘం, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం, ఏఎఫ్‌యూ నాయకులు దాసరి జనార్దన్, రియాజ్ అహ్మద్, కామెర గట్టయ్య, దయాకర్, శంకర్ మాట్లాడారు. 10 కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పరిశ్రమల రక్షణ కోసం, ఉద్యోగ భద్రత కోసం, అసంఘటిత రంగ కార్మికులకు నెలకు రూ. 26 వేల వేతనం చెల్లించాలని, సుప్రీం కోర్టు తీర్పుప్రకారం సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె పిలుపులో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక భాగస్వామిగా, సార్వత్రిక సమ్మె పిలుపులో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీలు భాగస్వామ్యంగా ఉన్నందున కార్మికులను భాగస్వాములను చేసేందుకు సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ ముందుకు వచ్చి అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మెను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు వాసర్ల ప్రసాద్‌రెడ్డి, జూపల్లి మల్లేశ్, పీ నర్సయ్య, చంద్రశేఖర్, వెంకటేష్, అలీ, ఆర్ నర్సయ్య, కే మధుకర్, తిరుపతి పాల్గొన్నారు.

# సివిల్ దవాఖానాకు పూర్వ వైభవం తీసుకొస్తాం

### ఎమ్మెల్యే జీఎస్ఆర్



రోగుల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల, మే 12 : చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల్లో పూర్వ వైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం పలు వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. అందుతున్న వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌కు సూచించారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత, సీసీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ తదితర విషయాలను ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో చిట్యాల సివిల్ దవాఖాన ప్రసూతి వైద్య సేవల్లో రికార్డులను నెలకొల్పిందన్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బందిని భర్తీ చేస్తామన్నారు. అధునాతన రోగనిర్ధారణ మిషనరీలను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తదనంతరం దవాఖానాలో నిర్వహించిన అంతర్జాతీయ నర్సు దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రి వెనకాల ఉన్న పిల్లల విభాగాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో చిట్యాల ఏఎంసీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**నిరుపేదలకు అండ సీఎం సహాయ నిధి**

కృష్ణకాలనీ : నిరుపేదకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే జీఎస్ఆర్ అన్నారు. సోమవారం క్యాంపుకార్యాలయంలో భూపాలపల్లికి చెందిన 35 మంది లబ్ధిదారులకు రూ.14,78,500 విలువైన చెక్కులను అందజేశారు. అలాగే ఇటీవల ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన మొత్తం 146 మందికి ఎమ్మెల్యే ఆఫర్ లెటర్లను అందజేశారు.

## నిరుపేదలందరికీ ఇండ్లు ఇస్తాం : సీతక్క

మంగపేట, మే 12 : రాష్ట్రంలోని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి, మాటకు కట్టుబడి ఉంటామని మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని శనగకుంటలో గతంలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు సోమవారం 15 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ దివాకరతో కలిసి ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణకు ప్రతి ఇంటికి నల్లాలు ఏర్పాటు చేశామని, గతంలో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఐటీడీఏలకు సీఎం ప్రత్యేక నిధులు కేటాయించి, అదనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారని గుర్తు చేశారు. లబ్ధిదారులకు త్వరగా బిల్లులు చెల్లించేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో భద్రు పాల్గొన్నారు.

## పల్లెల్లో తునికాకు సేకరణ ప్రారంభం

వాజేడు, మే 12 : తునికాకు సేకారణ పల్లెల్లో సోమవారం నుంచి ప్రారంభమైంది. మండలంలోని ప్రగళ్లపల్లి, మొరుమూరు, మొరుమూరు కాలనీ తదితర గ్రామాల్లో ప్రజలు ఉదయమే ఆకు సేకరించి 50 ఆకుల కట్టలుగా కట్టి కల్లం వద్దకు వెళ్లి వాటిని విక్రయిస్తున్నారు. 50 ఆకుల కట్టకు రూ.3.30 ధర నిర్ధరించినట్లు ఎఫ్ఆర్వో చంద్రమౌళి తెలిపారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి

చిట్యాల, మే 12 : వేసవిలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కోడపాక రఘుపతి సూచించారు. సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసం కోసం ఆటలు, పాటలు, బొమ్మలు గీయడం, యోగా, కథల పుస్తకాలు చదవడం తదితర వినోద కార్యక్రమాలు నేర్చుకోవడానికి ఈ శిక్షణ శిబిరం ఉపయోగపడుతుందన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీరామ్ రఘుపతి, బొమ్మ రాజమౌళి, బుర్ర సదయ్య, భాస్కర్, సీఆర్పీ రాజు, భద్రయ్య పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

# అబ్బుర పడేలా ఏర్పాట్లు చేయాలి

### ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, మే 12 : మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు అబ్బుర పడేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. ఈ నెల 14న రామప్ప ఆలయాన్ని సుందరీమణులు సందర్శించనున్న నేపథ్యంలో సోమవారం రాత్రి ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్‌తో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా రూట్ మ్యాప్‌ల ప్రకారం పోలీస్ బృందాలు తనిఖీ చేసి సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. 35 మంది సుందరీమణులు హైదరాబాద్ నుండి 'తెలంగాణ జరూర్ ఆనా' అనే టైటిల్‌తో ఏర్పాటు చేసిన ఏసీ బస్సుల్లో రామప్పకు నేరుగా చేరుకుంటారని అన్నారు. షెడ్యూల్ ప్రకారం జరిగే కార్యక్రమాల వద్ద ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. రామప్ప ఆలయ సందర్శన వారికి ఒక తీపి జ్ఞాపకంగా ఉండేలా, వారు అబ్బుర పడేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**విద్యుత్ శాఖ పనులను పరిశీలించిన సీఎండీ**

వెంకటాపూర్ : రాప్పలో విద్యుత్ శాఖ పనులను ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. దేవాలయం, సరస్సు, ఇంటర్‌ప్రిటేషన్ వద్ద విద్యుత్ పనులు, ఏర్పాటు చేసిన ట్రాన్స్‌పార్మర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 14వ తేదీన రెప్పపాటు విరామణ లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని తెలిపారు. ఆయన వెంట డీఈ టెక్నికల్ సీఎండీ సంపత్‌రావు, డీఈ ఆపరేషన్ నాగేశ్వర్‌రావు, డీఈ టెక్నికల్ భూపాలపల్లి వెంకటేశ్వర్లు, డీఈ సదానందం, ఏడీఈ వేణుగోపాలరావు, ఏడీ రామిరెడ్డి, ఈఏ రమేశ్, సబ్ ఇంజినీర్ సాంబరాజు ఉన్నారు.

**పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు : ఎస్పీ**

మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల సందర్శన నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శబరీశ్ తెలిపారు. సోమవారం ఆయన రామప్ప దేవాలయం పరిసర ప్రాంతాలను తనిఖీలు చేశారు. కంటెస్టెంట్‌లు సందర్శించే అవకాశం ఉన్న ప్రతి ప్రదేశాన్ని పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించి భద్రతా పరమైన విషయాలపై ఆదేశాలు జారీ చేశారు. బందోబస్తులో ఒక అడిషనల్ ఎస్పీ, ఒక ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 43 మంది ఎస్సైలు, 127 మంది ఏఎస్సైలు, 360 మంది కానిస్టేబుళ్లు,125 మంది స్పెషల్ పోలీసులు మొత్తం వెయ్యి మంది అధికారులతో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోంగార్డు మొదలు పై స్థాయి అధికారి వరకు వారివారికి కేటాయించిన స్థలంలోనే డ్యూటీ చేయాలని, డ్యూటీ పాయింట్ వదిలి ఎక్కడికి వెళ్లకుండా అధికారులు చూసుకోవాలని అన్నారు. ఆయన వెంట డీఎస్పీ రవీందర్, ఎస్‌బీ సీఐ శంకర్, ములుగు సీఐ సురేష్, పస్రా సీఐ రవీందర్, ఎస్సై సతీశ్ ఉన్నారు.



అగ్ని ప్రమాదంలో కాలిన మక్కజొన్న పంట

## మక్కజొన్న, ఆయిల్ పామ్ తోట దగ్ధం

టేకుమట్ల, మే 12 : మండలంలోని పెద్దంపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో మక్కజొన్న పంట, ఆయిల్ పామ్ తోట, డ్రిప్పు కాలిపోయాయి. రైతుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓదెల రామారావు మక్కజొన్న తోటలో నుంచి వెళ్లిన 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభం వద్ద తీగలపై ఒక్కసారిగా మంటలు చెలరేగి పంటకు అంటుకున్నాయి. గమనించిన పక్కనే ఉన్న రైతు కేకలు వేయడంతో పాటు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులంతా వెళ్లి ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ, మూడెకరాల మక్కజొన్న సొప్ప, కంకులు కాలిపోయాయని, పక్కనే ఉన్న పైడిపల్లి మల్లయ్యకు చెందిన ఆయిల్ పామ్ తోట అంటుకొని డ్రిప్ పైపులు మొత్తం కాలిపోయాయి. ప్రమాదంలో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై ఏఈ మణిదీప్‌ను వివరణ కోరగా, స్థలానికి విద్యుత్ అధికారులు వెళ్లి పరిశీలించగా అక్కడ లూజ్ వైరింగ్ గాని, పిట్ట వాలిన ఆనవాళ్లు కానీ, విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే ఎలాంటి ఆనవాళ్లు లేవని తెలిపారు. చేతికి వచ్చిన పంట కాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజావాణిలో 53 దరఖాస్తుల స్వీకరణ

ములుగురూరల్, మే 12 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ సంపత్‌రావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై 16, ఇండ్ల కోసం 8, పింఛన్ 2, ఇతర శాఖలకు 27 దరఖాస్తులు రాగా ఆయా శాఖల అధికారులకు బదిలీ చేసినట్లు వివరించారు. అలాగే ధాన్యం కొనుగోళ్లలో క్వింటాకు 8 నుండి 10 కిలోలు రైస్ మిల్లర్లు కోతలు విధిస్తున్నారని సీపీఎం పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. సిజెండా బ్రాండ్ మక్కజొన్న పంటతో నష్టపోయిన కన్నాయిగూడెం మండలంలోని కంతనపల్లి, ముప్పనపల్లి, బుట్టాయిగూడెం, చిట్యాల, గుర్రేవుల గ్రామాలకు చెందిన రైతులకు ఎకరానికి రూ.లక్ష నష్ట పరిహారం అందించాలని వినతిపత్రం అందజేశారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో దివ్యాంగులకు 5శాతం కోటా కేటాయించి ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దివ్యాంగుల హక్కుల సమితి జిల్లా ఇన్‌చార్జి చంద్రమౌళి, సభ్యులు వినతిపత్రం అందజేశారు.

## బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభం

ములుగురూరల్, మే 12 : జిల్లా కేంద్రంలో ఆర్టీసీ నూతన బస్టాండ్ నిర్మాణ పనులను అధికారులు సోమవారం చేపట్టారు. బస్టాండ్ పక్కన ఉన్న పాలకేంద్రం స్థలాన్ని ప్రభుత్వం తీసుకొని పాలకేంద్రాన్ని జాకారానికి తరలించింది. ఈ స్థలంలో ఉన్న భవనాన్ని తొలగించే పనులను జేసీబీతో అధికారులు చేపట్టారు. అనంతరం భూమి చదును పనులు చేపట్టి నిర్మాణ పనులను ముమ్మరం చేయనున్నారు.

## బైక్ ఆటోను ఢీకొట్టి ముగ్గురికి గాయాలు

మంగపేట; మే 12: లక్ష్మీనర్సింహస్వామి కల్యాణానికి వచ్చి గుట్టపై నుంచి ఘాట్ రోడ్డు మీదుగా వస్తున్న ఓ ఆటోను గుట్టపైకి వెళ్తున్న బైక్ ఢీకొట్టిన ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నర్సింహసాగర్‌కు చెందిన నర్సమ్మ, గాంధీనగర్ కు చెందిన శ్రీనుకు తీవ్ర గాయాలు కాగా, ఆటో డ్రైవర్ సతీశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565